# నలుపూ - తెలుపూ

విశ్వం

'అయ్యో పాపం.'

ఈ మాటలో ఎంత యింద్రజాలం ఇమిడి వున్నదని!

గాయపడ్డ మనస్సు కోరేదల్లా ఆ నిమిషంలో ఆ ఒక్కమాటే.

కాని అది మాత్రం అంత చౌకగా అందరికీ లభించదు. ఆ ఒక్క మాటకోసం అన్ని దిక్కులూ చూచి ఆశ వదులుకుని ఆకాశం వేపు చూచి నిట్టూర్చే మనసులూ మనుషులూ మన చుట్టూరా రోజూ కనిపిస్తూనే వుంటారు.

మనిషి హృదయం ఎంత చిత్రమైందో!

ఆ యింతమాటా అనడం కూడా అదో బ్రహ్మాండంగా తలంచే మనసు లెన్నివున్నవని! మాటమాత్రానికేంతే అనుకోలేము మరి. వెనకేదో ఓ సానుభూతిని వెలువరించే విధానం లేకపోతే అదీ వెలువడ్డం అంత తేలిక కాదు. చెకోవ్ కథొకటి జ్ఞాపకం వస్తున్నది.

ఓ బండిమనిషి పొద్దుట్నుంచీ సాయంకాలం దాకా రెక్కలువంచి మహాప్రేమతో తన పసికూనను సాకుతూవుంటాడు. అకస్మాత్తుగా వాడోరోజు చనిపోతాడు. రాతి గుండె వ్రయ్యలైపోతుంది.

అలాగే కాళ్ళీడ్చుకుంటూ గుర్రాన్ని తెచ్చి బండి కట్టుకుని బయలుదేరుతాడు. బండిలో కూచుని ప్రతివాడికీ తన పసిపాప మరణం గూర్చి చెప్పాలని ప్రయత్నిస్తాడు. కాని తమ పనులేవో ముంచుకొనిపోతాయని బరాబరా వెడిపోవాలనుకునే ప్రయాణీకులకు వీడి సోదె ఏం కావాలి? ఒక్కరూ చెవిని వేసుకోరు.

పాపం వాడు కొడుకు సంగతి ఆరంభించీ ఆరంభించకముందే వారు చీదరించుకొని బండి గబగబా పోనిమ్మంటారు.

ఇలా ఆరోజల్లా తన గుండె బరువు తీర్చుకొనేందుకై వాడు విశ్వప్రయత్నం చేస్తాడు. కాని తనమాట పూర్తి చేసే అవకాశం కూడా చిక్కదు.

ఆఖరు కలా ఆ శోక భారంతోనే రాత్రి యింటికి వస్తాడు. కాని తనలో లోపల తొలచి వేస్తున్న యాతనను బయటికి వెల్లడించాలి. తన మాట వినే సాధువు కనిపించడు.

మెల్లగా గుర్రాన్ని విప్పి కట్టివేస్తాడు. అదెంతో అనురాగంతో తన్ను చూచి సకిలిస్తుంది. బరువుగా అతనా గుర్రాన్ని చేతితో తడుతూ, దాని కళ్ళల్లోకి చూస్తూ తన కొడుకు చనిపోయిన సంగతిని వివరంగా చెబుతాడు. అదెంతో శాంతంగా వింటుంది. ఆఖరుకు కొడుకు పోయాడని ఆ ముసలి బండివాడు కన్నీరు విడుస్తాడు. ఆ గుర్రం కళ్ళల్లోంచి ఓ నీటిచుక్క జారి పడినట్టు భావించుకుంటాడు. తనపై సానుభూతి చూపే ఓ ప్రాణి కనిపించినందు కతనెంతో వూరట పడతాడు.

"పోయాడమ్మా మన పిల్లాడు పోయాడు" అంటే,

"అయ్యో పాపం" అన్నట్టు తలపంకిస్తుంది.

ఎవరు, ఎందుకు, ఎలా- యిలాంటి ప్రశ్నలే గాయపడిన మనసుకు తోచవు. ఓ జంతువు, ఓ చెట్టు, ఓ పువ్వు ఓ గాలి విసురు తన దుఃఖాన్ని అర్థం చేసుకున్నదని, తన యమయాతనను గ్రహించుకున్నదని, అయ్యో పాపం అన్నట్టు తల వూపగలదని అనుకుంటే చాలు. ఆ మనసు గట్టిగా నిట్టూర్చి బరువు తగ్గించుకుంటుంది.

కాని ఆ మాట అనేందుకు కూడా తటపటాయించే మనుషులే యెక్కువ మంది. కారణం ప్రత్యేకించి యేమీ లేకపోవచ్చు. ఒక్క సమాశ్వాసన వాక్యంతో తనకు ముంచుకొని పోయేదేమీ కనిపించక పోవచ్చు. అయినా ఒకడి గుండె బరువు తగ్గిస్తే వచ్చేదేమిటి? అని ఆ మనసు అప్రయత్నంగా ఆలోచించుకుంటుందేమో మనకు తెలియదు.

మర్యాదకోసం సానుభూతి ప్రకటించేవారు కూడా ఆ బరువు తమపై పడుతుందేమో అని భయభ్రాంతులవుతుంటారనుకుంటాను. మనం

వెళ్ళి యేదో చెబితే వింటారు. అయ్యో పాపం అననూ అంటారు. కాని వెంటనే ఆ వేపు యెక్కడో చూస్తూ ఎవరినో గట్టిగా కేక వేస్తారు. యింతటితో యీ ప్రపంచంనుండి తప్పించుకొని మరే విషయంమీదనో సంభాషణ తిరిగిపోతుంది.

ఆసలు బాధలంటే మనిషికి బ్రహ్మాండమైన భయం కావచ్చు? తనవే కాదు, మరెవరివైనా అతను వినడానికి తనకు వీలయినంతలో ఒప్పుకోడు. తప్పించుకోనేందుకే సర్వేసర్వత్రా తంటాలు పడతాడు.

లోతుల్లోకి చూస్తే అతనికళ్ళు తిరుగుతాయి. కాబట్టే అతను ఆకసంవేపు చూస్తాడు. లేదా గట్టిగా కళ్ళు మూసుకుంటాడు. గాయపడిన గుండె నెత్తురు కార్చకపోతే పన్నీరెలా వెద జల్లుతుంది. ఈసంగతతనికి తెలుసు. నెత్తురు చూస్తే అతనికళ్ళు చీకట్లుపడిపోతాయని భయ భ్రాంతుడవుతాడు.

ఎటుచూచినా రోదనం, ఎటు విన్నా బాధలు, ఎటువెళ్ళినా కూలినకొంపలు కనిపిస్తుండగా అతను గిలగిల లాడుతున్నాడు. తన హృదయంలోపలి పొరలలో చూచుకున్నప్పుడు, నిజాయితీకల మనిషి నరకయాతనను అనుభవించవలసి వస్తుంది. ఒక్క సానుభూతి మాటే గదా అని నోరు జారాడా తనలో యేదో భూకంపం, మహాప్రళయం జరిగినంత పనవుతుంది.

ఒక్క కరుణానినాదం కోసంటూ విన్నాడా తను నీరుగారిపోవలసి వస్తుంది. అది తన కిష్టం లేదు. హాయిగా నిద్రపోవాలంటే యీ క్రూర ప్రపంచంలో ఆత్మవంచనే శరణ్యమవుతున్నది. లేదా తానూ బాధపడాలి. ఈ బాధలగూర్చి ఆలోచించాలి. ఆ ఆలోచనలో పడ్డాడా ఇక నిద్రపట్టదు. కానీ అతనందుకు సిద్ధంగా లేడు.

ఆలోచించే అపేక్ష అందరికీ వుండదు కాబట్టే, ఆశ్వసించాలన్న ఔత్సుక్యం అందరికీ వుండదు కాబట్టే యింకా దేశంలో సుఖంగా నిద్రపోయేవారున్నారు.

అందువల్లనే

'అయ్యో రామ' అనే మాట కోసం తపించేవారూ వుంటున్నారు.

ఏమిటో మనుష్యులు, వీరిని చూచి ఏడవాలో నవ్వాలో తెలీదు. ఎంత భయస్థులు.

'అయ్యో పాపం.'

కథానిక

# తీరిపోయిన బాకీ

"సులోచన"

"ఏమండీ, విశ్వనాథం గారూ. నమస్కారం!"

అంటూ గడప దాటి లోపలకొచ్చాడు రామబ్రహ్మం.

ప్రతినమస్కారంచేసి, ఆ వచ్చిన వ్యక్తితో తనకి సంబంధం అట్టే లేదన్నట్టు తన పనిలో తాను నిమగ్నుడయ్యాడు విశ్వనాథం.

రామబ్రహ్మం ప్రక్కన కాళీగా ఉన్న కుర్చీలో నిండుగా చతికిలపడి, చిన్న దగ్గుదగ్గి "చూడండీ! ఏదో పనిలోఉన్నట్టున్నారు. క్షమించండి! నా విషయం ఏంచేశారు? ఆర్డరు వేయించి ప్రెసిడెంటు గారిచేత సంతకం పెట్టించారా?" అన్నాడు.

విసుగ్గాతలెత్తి, అసహ్యంగా ఒక్క చూపు చూసి, ఈ వెట్టి చాకిరీ అంతా యెవరు చేస్తారన్నట్టు, మళ్లీ తలదించుకొని ఏదో వ్రాసుకుంటున్నాడు, హెడ్‌క్లర్కు విశ్వనాథం. రామబ్రహ్మానికి శరీరంనిండా జెర్రులు ప్రాకినట్లయింది కొంచెంసేపు సేద తీర్చుకున్న తరువాతకూడా, తనకంటె వెనుకవచ్చిన ముగ్గురు పెద్దమనుష్యులతో హాయిగా మాట్లాడినతరువాత కూటో, విశ్వనాథం తనకేసి చూపకపోవటంలో గల అంతరార్థం బోధపడింది రామబ్రహ్మానికి. విశ్వనాథం తననుంచి అందరిలాగానే లంచం కోరుతున్నాడు తను చాలా నియమాలు కల మనిషనీ, దేహీ అన్నవాడికికూడా కానీ చేత్తో